లోటు వర్షపాతంతో రైతన్నల పాట్లు



భైంసా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిహాసం చేస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరుణుడి కరుణ లేక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. మొలకెత్తిన విత్తనాలు తడులు అందక వాడి వాలిపోతుండడంతో కలత చెందుతున్నారు. వాడుతున్న మొక్కలను కాపాడుకునేందుకు గాను పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ గ్రామాన వరుణ దేవుని కరుణ కోసం గాను పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 173.3 మిల్లీమీటర్లు ఉండగా, మాసాంతం నాటికి 32 మీ.మీటర్ల లోటు వర్షపాతంతో 141.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

- జిల్లా లో జూన్ సాధారణ వర్షపాతం 173.3 నమోదు
- నమోదైన వర్షపాతం 141.3 మి.మీ
- 15 మండలాల్లో లోటు వర్షపాతం
- కుభీర్, నర్సాపూర్, నిర్మల్ అర్బన్, రూరల్ మండలాల్లో సాధారణ స్థాయిని దాటిన వర్షపాతం

● 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదు



జిల్లాలోని 19 మండలాల్లో నిర్మల్ అర్బన్, నిర్మల్ రూరల్, కుభీర్, నర్సాపూర్ (జీ) మండలాలు మినహా మిగతా 15 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. కుభీర్ మండలంలో సాధారణ వర్షపాతం 174.7 మి.మీటర్లు ఉండగా 200.8 మి.మీటర్ల వర్షపాతం, నర్సాపూర్ (జీ) మండలంలో సాధారణ వర్షపాతం 170 మి.మీటర్లు ఉండగా 185.6 మి.మీటర్ల వర్షపాతం, నిర్మల్ అర్బన్‌లో 176.1 మి.మీటర్లకు గాను 228.5 మి.మీటర్లు, నిర్మల్ రూరల్‌లో 177.2 మి.మీటర్లకు 185.7 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా 15 మండలాల్లో నమోదైన లోటు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.

తానూర్ మండలంలో 175.2 మి.మీటర్లకు 89.7 మి.మీటర్లు, బాసర మండలంలో 185.7 మి.మీటర్లకు గాను 120 మి.మీటర్లు, ముథోల్ మండలంలో 186.1 మి.మీటర్లకు గాను 116.1 మి.మీటర్లు, భైంసా మండలంలో 192.7 మి.మీటర్లకు గాను 143.4 మి.మీటర్లు, కుంటాల మండలంలో 169 మి.మీటర్లకు 163.4 మి.మీటర్లు, లోకేశ్వరం మండలంలో 158.5 మి.మీటర్లకు గాను 140 మి.మీటర్లు, దిలావర్‌పూర్ మండలంలో 185.1 మి.మీటర్లకు గాను 133.1 మి.మీటర్లు, సారంగపూర్ మండలంలో 184 మి.మీటర్లకు గాను 157.4 మి.మీటర్లు, సోన్ మండలంలో 168.3 మి.మీటర్లకు గాను కేవలం 88 మి.మీటర్లు, లక్ష్మణచాంద మండలంలో 153.5 మి.మీటర్లకు గాను 117.8 మి. మీటర్లు, మామడ మండలంలో 146.9 మి.మీటర్లకు గాను 130.8 మి.మీటర్లు, పెంబి మండలంలో 174.6 మి.మీటర్లకు 163.4 మి.మీటర్లు, ఖానాపూర్ మండలంలో 169.5 మి.మీటర్లకు గాను 109 మి.మీటర్లు, కడెం మండలంలో 173.1 మి.మీటర్లకు గాను 107.9 మి.మీటర్లు, దస్తూరాబాద్ మండలంలో 167.8 మి.మీటర్లకు 105.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.



తానూర్ మండలంలో వాడిపోతున్న మొక్కలను నీరు పోస్తున్న రైతులు



భైంసా మండలంలో వాడిలో కప్పతల్లి ఆడుతున్న రైతులు

● గతేడాది అధిక వర్షపాతం నమోదు

జిల్లాలో గత జూన్ మాసంలో సాధారణ స్థాయిని దాటి వర్షపాతం నమోదు అయ్యింది. సాధారణ వర్షపాతం 173.3 మి.మీటర్లు ఉండగా గతేడాది 193.3 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.ఈ యేడాది 32 మి.మీటర్ల లోటు వర్షపాతం నమోదు అవ్వగా గతేడాది 24 మి.మీటర్ల అధిక వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం జిల్లాలోని 19 మండలాల్లో 14 మండలాల్లో సాధారణ స్థాయిని దాటి అధిక వర్షపాతం నమోదు అవ్వగా భైంసా, ముథోల్, మామడ, ఖానాపూర్, దస్తూరాబాద్ మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది.

గంగమ్మ తల్లికి ఘనమైన పూజలు

● బోనమెత్తిన గుండంపల్లి



బోనమెత్తుకుని గంగామాత ఆలయానికి ర్యాలీగా వెళ్తున్న గుండంపల్లి మహిళలు

దిలావర్‌పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గంగా నీకు శరణమే... ఘనమైన పూజలే... నీకు అంటూ గుండంపల్లి మహిళలు సోమవారం సాయంత్రం గంగమ్మతల్లికి శరణు వేడారు. మహిళలందరూ బోనమెత్తగా చిన్న పెద్ద అందరూ ర్యాలీగా గంగమ్మ తల్లి ఆలయానికి బయలుదేరారు. బాజాభజంత్రీలు, డప్పుల చప్పుళ్లతో గ్రామ మహిళలు అమ్మవారికి బోనం సమర్పించేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా గుండంపల్లి మొత్తం అమ్మవారి బండారి పసుపు రంగు సంతరించుకుంది. అమ్మవారి పూనకంతో కొంతమంది శివసత్తులు నృత్యాలు చేశారు. హై లెవెల్ కెనాల్ ఒడ్డున కొలువైన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు సల్లంగా ఉండేలా చూడు తల్లి అని మొక్కుకున్నారు. గ్రామస్థులందరూ నియమ నిష్టలతో గంగామాతను శరణు కోరారు.

తిరుపతిలో అలరించిన

భైంసా కళాకారుల నృత్య ప్రదర్శనలు



తిరుపతిలో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న భైంసా కళాకారులు

భైంసా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానంలోని అన్నమయ్య సాహితి కళా వికాస పరిషత్‌లో నిర్వహించిన శ్రీనివాస కళార్చన కార్యక్రమంలో భైంసా కళాకారులు చేపట్టిన నృత్య ప్రదర్శనలు అలరారించాయి. శనివారం జరిగిన శ్రీనివాస కళార్చన కార్యక్రమంలో భైంసాలోని శార్వాణీ సంగీత నృత్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు శిక్షకురాలు మియ్యాపురం శ్రీవాణి ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమి శ్రీనివాస కళార్చన కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భైంసాకు చెందిన కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలపై చేపట్టిన నృత్య ప్రదర్శనలు శ్రీనివాస కళార్చనకే వన్నె తెచ్చాయి. కార్యక్రమ నిర్వాహకులు నృత్య ప్రదర్శనలు చేపట్టిన కళాకారులకు ప్రశంస పత్రాలను అందజేశారు.

ఖానాపూర్‌లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి భూమి ఉందని నిరూపించేందుకు జేఏసీ సిద్ధం

● జేఏసీ కన్వీనర్ నందిరామయ్య

● జేఏసీ ఆధ్వర్యంలో 110 ఎకరాల ప్రభుత్వ స్థలం పరిశీలన




పట్టణ శివారులోని 110 ఎకరాల ప్రభుత్వ భూమిలో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

ఖానాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఖానాపూర్‌కు మంజూరు చేసిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఖానాపూర్ ప్రాంతంలో నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం భూమి ఉందని నిరూపించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి జేఏసీ సిద్ధంగా ఉందని జేఏసీ కన్వీనర్ నంది రామయ్య, కో కన్వీనర్ బీసీ రాజన్నలు అన్నారు. సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని 110 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... ఖానాపూర్‌లో ప్రభుత్వ స్థలం లేదనే సాకుతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఉట్నూర్‌కు తరలించడం సరికాదన్నారు. జేఏసీ నాయకులతో మాట్లాడేందుకు ఎమ్మెల్యే సమయం కేటాయిస్తే పట్టణ శివారులో 271, 272, 273, 281 సర్వే నెంబర్లలో 110 ఎకరాల స్థలం ఉందనే విషయాన్ని స్పష్టంగా తాము నిరూపిస్తామన్నారు. ఓ పక్క ఖానాపూర్ శివారులోని విలువైన ప్రభుత్వ స్థలం కేవలం మొరం మాఫియాకు వరంగా మారిందన్నారు. 110 ఎకరాల ప్రభుత్వ భూమి నుండి కొంత మంది మొరాన్ని తరలించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారన్నారు. ఈ మొరం మాఫియా విధ్వంసానికి విలువైన ప్రభుత్వ స్థలం లోతైన చెరువులను తలపించేలా మారిందన్నారు. ఇప్పటికైనా ఈ స్థలాన్ని ఉపయోగంలోకి లేకుంటే కేవలం అక్రమార్కులకు అడ్డాగా మాత్రమే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ నిరుపేదల ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడాలంటే ఇక్కడ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్లు ఆకుల శ్రీనివాస్, కొండాడి గంగారావు, ప్రధాన కార్యదర్శి కాశవేణి ప్రణయ్, కోశాధికారి ఎనగందుల నారాయణ, జేఏసీ ముఖ్య సలహాదారులు కొక్కుల ప్రదీప్, తోట సుమిత్, గోరేకర్ రాజు, సందుపట్ల శ్రావణ్, నరేందర్ రెడ్డి, నాగెల్లి నర్సయ్య, సుధాకర్, శ్రీకాంత్, రాజేశ్వర్, లాజర్, రాజశేఖర్, భూమేష్, విన్ను సహా పలువురు నాయకులు పాల్గొన్నారు.

రక్తహీనత బారిన

పడకుండా పౌష్టికాహారం తీసుకోవాలి



ఖానాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనత బారిన పడకుండా బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఖానాపూర్ హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. సోమవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలశక్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఎదిగే దశలో బాలికలు తీసుకోవలసిన పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉండేందుకు పాటించాల్సిన మెళకువలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్ రావు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది యోచన, రజిత, ఆశాలు మల్లీశ్వరి, సునీత, భాగ్య, తదితరులున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోండి

● కలెక్టర్ అభిలాష అభినవ్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించాలంటూ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె స్వయంగా పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి వెంటనే పరిష్కార మార్గాలు చేపట్టాలని ఆదేశించారు. వానాకాలం నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం జరుగకూడదని స్పష్టం చేశారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలంటే అన్ని శాఖలు లక్ష్యంగా నిర్దేశించిన మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) గోడ ప్రతిని కలెక్టర్ ఆవిష్కరించారు. డీట్ యాప్ ద్వారా యువత ఉపాధి అవకాశాల సమాచారం పొందవచ్చని, విద్యార్హతలు, నైపుణ్యాలు నమోదు చేసుకుంటే కంపెనీల నుంచి అవకాశాలు పొందగలుగుతారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 49ని రద్దు చేయాలి

పెంబి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవోనెంబర్ 49ని రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘ మండల అధ్యక్షులు టేకం ధర్మరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 మే 30న తడోబా, అందరి రిజర్వ్ ఫారెస్టును కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌తో కలుపుతూ కొమురం భీమ్ జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పరిధిలో 334 గ్రామాలను గెజిట్‌లో పేర్కొంటూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 49 కొమురం భీమ్ కన్జర్వేషన్ రిజర్వ్ ప్రాజెక్టును రద్దు చేయాలని ఈ ప్రాంతం భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఉంది. ఇక్కడ గ్రామసభ, సమావేశాలు లాంటి గిరిజన చట్టాలను అమలు అమలుపరచకుండా ఈ గ్రామంలో ఎలాంటి సభలు నిర్వహించకుండా రాజాభిప్రాయం తీసుకోలేదు. ఇక్కడ రిజర్వ్ ఫారెస్ట్ చేపడుతున్న సందర్భంగా ప్రభుత్వం నుండి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు, త్రీ ఫెస్ కరెంటు, రోడ్లు, ఇతర సదుపాయాలు అన్ని ఫారెస్ట్ అధికారులు ఆపేశారు. అభివృద్ధి వైపు పోకుండా చూస్తున్నారు. ఆదివాసీలను అడవి నుండి గెంటేసి అడవిలో ఉన్న ఖనిజాలు పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతుందని, ఈ జీవోనెంబర్ 49 రాజాభిష్టానికి వ్యతిరేకంగా ఉన్నందున తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరూ మరొక పెద్ద పోరాటానికి సిద్ధం కావాలని దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ నాయకులు పెంద్రం జంగు, టేకం బాలేరావు, ఆత్రం జైవంత్ రావు, ఆత్రం మాణిక్ రావు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన నాయకులు

కలుపు తీసేందుకు కూలీల కొరత

● రైతులకు తప్పని తిప్పలు



కలుపు తీస్తున్న మహిళా రైతులు

భైంసా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సాగుబడి రంగంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. వరుణ దేవుడి కరుణ,కటాక్షలు అంతంత మాత్రంగానే ఉంటుండటంతో వాడిపోతున్న మొక్కలను కాపాడేందుకు తంటాలు పడుతున్న అన్నదాతలకు కలుపు మొక్కల బెడద మరిన్ని ఇబ్బందులను తెచ్చి పెడుతోంది. పంటచేలలో కలుపుమొక్క అధికమయ్యింది. ఈ క్రమంలో ఆయా పంటలలోని కలుపు మొక్కలను ఏరివేసేందుకు కూలీల కొరత ఏర్పడింది.కలుపు మొక్కలను ఏరివేసేందుకు కూలీలు దొరకక రైతన్న తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు.గత ఏడాది ప్రతికూల పరిస్థితులతో పంటలు దెబ్బతిని కోలుకోలేని విధంగా నష్టపోయామని,ఈ యేడాది ఉధృతంగానున్న కలుపు మొక్కల ప్రభావం పంటలపై పడే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లభ్యమవుతున్న కూలీలు కలుపుతీతకు ఒక్క రోజుకు గాను రూ.250 నుండి రూ. 300 వరకు డిమాండ్ చేస్తున్నారు.అంతేకాకుండా పంటచేల వరకు రాకపోకలు నిర్వహించేందుకుగాను ఆటోను ఏర్పాటు చేయాలని షరతును విధిస్తున్నారు.సాయంత్రం ఇంటికి వెళ్ళే సమయంలో కూలీ డబ్బులతో పాటుగా ఇతర పనుల కొరకు రూ.20 నుండి రూ.30 వరకు తీసుకుంటున్నారు.కొన్ని గ్రామాల్లోని రైతులు తమ గ్రామంలో కూలీల కొరత నెలకొని ఉండటంతో ఇతర ప్రాంతాల నుండి ఆటోలలో కూలీలను తరలించుకవచ్చి కలుపుమొక్కలను ఏరిపిస్తున్నారంటే పరిస్థితి ఎంత వరకు వచ్చిందో చెప్పకుండానే తెలిసిపోతుంది.అసలే పెరిగిన సాగు వ్యయాలతో విలవిలలాడిపోతున్న అన్నదాతకు కలుపు మొక్కల ఏరివేత కూలీలు చార్జీలు అధనపు భారంగా మారుతున్నాయి.

వరుణుని కరుణ కోసం భారీ అన్నదానం



అన్నదాన కార్యక్రమం

భైంసా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని గాంధీగంజ్ వ్యాపారస్తులు సోమవారం వరుణుని కరుణ కోసం గాను భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం వేళలో గంజ్ పరిధిలోని సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లు, అడతీ(కమీషన్ ఏజెంట్లు) దుకాణదారులు పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో గల ప్రధాన ఆలయాలకు వెళ్లి వరుణుని కరుణ కోసం ప్రత్యేక పూజలు చేపట్టారు. శోభాయాత్రగా ఆలయాలకు తరలివెళ్లిన వ్యాపారులు పలు ఆలయాల్లో జలాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భైంసా పట్టణ పరిధిలోని అన్ని వర్గాల వారీతో పాటు వారంతపు సంత వ్యాపారులు, కోనుగోలుదారులు, రైతులు అధిక సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సారంగాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజీ నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు చెందాయన్నారు. గత ప్రభుత్వం పది సంవత్సరాల నుండి ఇండ్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తానని హామీలను ఇచ్చి నిరుపేదల కలలను నరవేర్చలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేదలను దృష్టిలో ఉంచుకొని ఇందిరమ్మ పతకం పేరుతో నిరుపేదలందరికి ఇండ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో నిరుపేదలందరు ఇండ్లను నిర్మించుకుంటున్నారని అన్నారు. దీంతో రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలుపొందుతారని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోర్వ నవీన్‌రెడ్డి, ఉన్నారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు



యూరియా కోసం రైతుల పడిగాపులు

ముథోల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం వేకువజామున నుండే యూరియా కోసం రైతులు బారులు తీరారు. పీఏసీఎస్ కార్యాలయంకు 450 బస్తాల యూరియా రావడంతో ఉదయాన్నే అధిక సంఖ్యలో రైతులు చేరుకున్నారు. యూరియా బస్తాలు తక్కువ రైతులు ఎక్కువ రావడంతో సరిపడా యూరియా దొరకకపోవడంతో రైతులు నిరాశతో ఇంటి ముఖం పట్టారు.

రూ.5.88 కోట్లతో

బ్రాహ్మణ్‌గావ్ లిఫ్టుల పునరుద్ధరణ

● ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర మండలం కౌత గ్రామంలోని బ్రాహ్మణ్‌గావ్ -1, 2 లిఫ్టులను రూ.5.88 కోట్లతో పునరుద్ధరించడానికి ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. ఈ మేరకు సోమవారం నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు విలేకరుల అరెస్టు

● రైతు వద్ద రూ.50 వేల నగదు డిమాండ్

● అప్పు తెచ్చి మరీ విలేకరులకు రూ. 30వేలు చెల్లించిన రైతు

● పోలీసులకు ఫిర్యాదు.. ముగ్గురు రిమాండ్‌కు తరలింపు

నేరడిగొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఓ రైతు వద్ద బెదిరింపులకు పాల్పడి రూ.30వేలు వసూలు చేసిన ముగ్గురు రిపోర్టర్లను అరెస్టు చేసిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన టగరే కాసాన్ దాస్ వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత మేలో తనింట్లో ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు ఉండడంతో.. తన చేనులో పండిన జొన్న పంటను సమీపంలో గల గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆరబెట్టుకున్నాడు. దీన్ని గమనించిన నేరడిగొండకు చెందిన ముగ్గురు విలేకరులు గాజుల దేవేందర్ (నవ తెలంగాణ), షేక్ ఫస్యుద్దీన్ (ఉద్యమ కెరటం), గాజుల శ్రీకాంత్ (ఆంధ్రప్రభ)లు గత మే 18వ తేదీన రైతు కాసాన్ దాస్‌ను భయభ్రాంతులకు గురి చేశారు. పాఠశాల ఆవరణలో పంటను ఆరబెట్టినందుకు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయిస్తానని బెదిరించారు. ఈ విషయం ఎవరికి చెప్పకుండా ఉండాలంటే తమకు రూ. 50 వేలు ఇవ్వాలని రైతును డిమాండ్ చేశారు. దీంతో భయపడిన రైతు టగరే కాసాన్ దాస్ తాను అంతమొత్తం ఇచ్చుకోలేనని వేడుకున్నాడు. చివరికి ఆ ముగ్గురు విలేకరులకు రూ.30 వేలు ఇచ్చాడు. ఆ తర్వాత రైతు జరిగిన ఘటనపై పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రైతుని భయపెట్టి బెదిరించి బలవంతంగా అతని వద్ద నుంచి రూ. 30వేలు తీసుకున్న విలేకరులు గాజుల దేవేందర్, షేక్ ఫస్యుద్దీన్, గాజుల శ్రీకాంత్‌లను పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ. 1800 నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రాజు తెలిపారు. ఎవరైనా బలవంతంగా బెదిరింపులకు ఉపేక్షించకుండా జిల్లా పోలీసు యంత్రాంగా కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులు..

ఆదిలాబాద్ అర్బన్: మత్తుపదార్థాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కరుణాకర్‌రావు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆదివారం ఉదయం 2గంటల ప్రాంతంలో రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులు మహమ్మద్ మోయిజ్, న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీ, రాంనగర్, అలాగే షేక్ సమీర్, చిలుకూరు లక్ష్మినగర్, ఆదిలాబాద్, అలాగే షేక్ అబ్దుల్ ఫయాజ్, చిలుకూరు లక్ష్మినగర్ కాలనీకి చెందిన వారన్నారు. మత్తుకు అలవాటు పడి తరుచు దొంగతనాలు చేస్తూ ఉంటారని తెలిపారు. ఈ సమయంలోనే ముగ్గురు కలిసి శనివారం ఉదయం రెండు గంటల ప్రాంతంలో రిమ్స్ హాస్పిటల్ పక్కన గల సాయి సేవా హాస్పిటల్ మెడికల్ షాప్‌లో అక్రమంగా ప్రవేశించి డెస్క్‌లోని మొబైల్‌ఫోన్, రూ.200 నగదు, టర్మైన్ ఇంజక్షన్లు మూడు, మెడజాలం ఇంజక్షన్ దొంగలించి పారిపోయారని పేర్కొన్నారు. కాగా, 24గంటల్లోనే దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని వివరించారు.

'మట్టిలో మాణిక్యంలా ఎదగాలి'

తలమడుగు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మట్టిలో మాణిక్యంలా ఎదగాలని విజయ డెయిరీ మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన టీజీ పీఈసీఈటీ ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించిన నీలగిరి సాయి మిత్రను మాజీ డైరీ చైర్మన్ లోక భూమారెడ్డి సన్మానించారు. తలమడుగుకు చెందిన నీలగిరి మీనాక్షి, అశోక్ దంపతుల కుమార్తె సాయిమిత్ర తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలో 12వ ర్యాంకు సాధించింది. ఈ కార్యక్రమంలో రుయ్యాడి గ్రామ మాజీ సర్పంచ్ పోతారెడ్డి, నీలగిరి అశోక్, పీఏసీఎస్ సీఈవో శ్రీనివాస్, వెంకటరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల రాయితీ సన్న బియ్యం స్వాధీనం

● గాదిగూడ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరిపై కేసు నమోదు

నార్నూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే రాయితీ సన్న బియ్యం పక్కదారి పడుతుంది. గాదిగూడ మండలంలోని రెండు కిరణా దుకాణాలలో పోలీసులకు అందిన పక్క సమాచారం మేరకు సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో 25 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ సన్న బియ్యం దొరకడంతో ఇద్దరిపై గాదిగూడ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి 14 రోజుల రిమాండ్‌కు తరలించడం జరిగిందని నార్నూర్ సీఐ పి.ప్రభాకర్ తెలిపారు. మండలకేంద్రం కూర శివాజీ దగ్గర నుంచి 17.6 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం స్వాధీనం, లోకారి(కే) గ్రామంలో షేక్ జావిద్ కిరాణా దుకాణంలో తనిఖీ నిర్వహిస్తే 7.3 ప్రభుత్వ రాయితీ బియ్యం దొరికాయి. ఎవరైనా రాయితీ బియ్యం తరలించడం గాని అక్రమంగా నిల్వ ఉంచిన డయల్ యువర్ ఎస్సీ సెల్ నెం. 8712659923 వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని పోలీసులు పేర్కొన్నారు.



ప్రభుత్వ రాయితీ సన్న బియ్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం



పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈవో

బాలికల పాఠశాలను సందర్శించిన ఎంఈవో

బోథ్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక ఉన్నత పాఠశాల. విద్యార్థులు బురద వల్ల ఇబ్బందులు పడుతున్న విషయాన్ని పాఠశాల ఆవరణ బురదమయం అన్న శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో సోమవారం మండల విద్యాధికారి మహమ్మద్ హుస్సేన్ స్పందించి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో బురదమయమైన స్థలాన్ని పరిశీలించి తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు ఉపాధ్యాయులకు హామీ ఇవ్వడం జరిగింది. ఇటీవల నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో 40 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించడం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. రాత్రి వేళల్లో చుట్టుపక్కల ప్రహరీ లేక మందుబాబులు మద్యం సేవిస్తున్నారని ఎంఈవో దృష్టికి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకు వచ్చారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజిత, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, అనసూయ, సవిత నవ్యశ్రీ, తదితరులు ఉన్నారు.

ఒకే వేదికపై వేర్వేరుగా.. చెక్కుల పంపిణీ

బోథ్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ఈ. రాజు యాదవులు ముఖ్య వేదికపైన వేర్వేరుగా ఒకే సమయంలో చెక్కులను పంపిణీ చేశారు. మండలం మొత్తం తొమ్మిది మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులు రావడంతో చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీద అందించారు. అనంతరం సోనాల మండల కేంద్రంలో చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో సోనాల తహసిల్దార్ ఇమ్రాన్‌ఖాన్, బోథ్ డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్‌తో పాటు ఆర్ఐ సునీత, డిటి ఎన్‌ఫోర్సుమెంట్ సూరజ్ రావు, మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సర్పంచ్ల సంఘం మాజీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్, పలు గ్రామాలు వాటి నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు తాంసి విద్యార్థుల ఎంపిక

తాంసి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు తాంసి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు సంజన, అనన్యలు ఎంపికయ్యారు. సోమవారం వెలువడిన ఫలితాలలో వారు ఎంపికయ్యారు. అదేవిధంగా కప్పర్ల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వైష్ణవి, శరణ్య, ఓంకార్‌లు కూడా ఎంపికయ్యారు. ఎంపికైన ఈ విద్యార్థులకు ప్రతి విద్యా సంవత్సరం రూ. 12 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు అనగా ఇంటర్మీడియట్ వరకు ఈ స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం అందించనుంది.

వేతనాలు రాక కార్మికుల వెతలు

బోథ్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల కాలంగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలమైన తమకు మూడు నెలలుగా వేతనాలు రాకపోతే తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తున్నాయని వారు వాపోయారు. తమకు సకాలంలో వేతనాలు అందించే విధంగా చూడాలని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. అనంతరం స్థానిక ఎస్సైకి తమకు ఆదిలాబాద్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఏది ఏమైనా ప్రభుత్వం తక్షణమే తమ వేతనాలకు సంబంధించిన నిధులు మంజూరు చేయకపోతే తమ ఆందోళనను ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు.

'అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు'

తలమడుగు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం అందిస్తుందని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గిరిజన గ్రామమైన సకినాపూర్‌లో గ్రామస్తులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ ఆదివాసీలకు ఒక ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు విడతలుగా మండలంలో దాదాపు 480 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో మాజీ సర్పంచ్ పునాజి, లోక ప్రవీణ్ రెడ్డి, నగేష్, సురేందర్, రాజు పటేల్, శంకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'యాజమాన్య హక్కులు కల్పించాలి'

నేరడిగొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అటవీ హక్కుల భూములపై సర్వే పూర్తి చేసి యాజమాన్య హక్కులు కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) చైర్మన్ బద్దం పురుషోత్తం రెడ్డి వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా జీవిస్తున్న అనేకమంది గిరిజనులు, ఇతర వ్యవసాయ కుటుంబాలు తమ సొంతంగా సాగు చేస్తున్న భూములపై ఇప్పటికీ యాజమాన్య హక్కులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, అర్హులకు భూస్వామ్య హక్కుల పట్టాలు ఇవ్వాలి అని రైతులు డిమాండ్ చేశారు.

నీటి బొట్టు.. ఒడిసి పట్టు!

(5వ పేజీ తరువాయి...)

అధికారుల తీరు కనిపిస్తుంది. ఇంకుడు గుంతల్లోకి వర్షపునీటిని మళ్లించక పోవడంతో నిరుపయోగంగానే మారుతున్నాయి. ప్రతియేటా ఇంకుడు గుంతల్లోకి చేరినా.. పూడికను తొలగిస్తేనే వర్షపునీరు ఇంకే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు జడ్పీ కార్యాలయం, టీటీడీసీ, మున్సిపల్, డీఆర్డీఏ, డీపీవో, డీఎంహెచ్‌వో, రిమ్స్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియం, గాంధీ పార్కు, తదితర కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు పిచ్చిమొక్కల మధ్య చెత్తాచెదారంతో అధ్వానంగా మారి దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచి పోతున్నా.. ఇంకుడు గుంతల వైపు అధికారులు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు. ఇకనైనా ఇంకుడు గుంతలను పునరుద్ధరిస్తే వర్షపునీరు ఇంకి భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉందంటున్నారు.

అమలుకు నోచుకోని వాల్టా చట్టం

అధికారుల నిండు నిర్లక్ష్యంతో ఇంకుడు గుంతలు కనిపించకుండానే పోతున్నాయి. ఇంటి అనుమతులు ఇచ్చే సమయంలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాల్సి ఉంటుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ స్థలం ఇబ్బందులతో పాటు అధికారు లు కఠినంగా వ్యవహరించక పోవడంతో నూతనంగా నిర్మించే ఇంటి నిర్మాణాల్లోనూ ఇంకుడు గుంతల జాడ కనిపించడం లేదు. అపార్ట్‌మెంట్ భవన నిర్మాణ సముదాయాల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి యజమానులు ముందుకు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో కొంతమేరకు ఇంకుడు గుంతలను నిర్మించుకుంటున్నా.. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో మధ్యలోనే వదిలేస్తున్నారు. పట్టణ ప్రాంతంలోనూ ఇంకుడు గుంతలకు ప్రాధాన్యతను ఇవ్వకపోవడంతో చిన్నపాటి వర్షాలకే మురికి నీటి కాలువలు ఉప్పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. అధికారులు వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయక పోవడంతో ఏటేటా భూగర్భజలాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. అధికారులు ప్రతియేటా అవసరమైన లక్ష్యాన్ని నిర్ణయిస్తున్నా.. ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇవే పరిస్థితులు మరి కొన్నాళ్ల పాటు ఉంటే నీటి ఇబ్బందులు మరింత ఝటిలమయ్యే ప్రమాదం ఉందంటున్నారు.

కజ్జర్లలో విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

తలమడుగు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కజ్జర్ల గ్రామనికి చెందిన జువ్వక లక్ష్మి విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని తలమడుగు ఎస్ఐ రాధిక తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. మండలంలోని కజర్ల గ్రామానికి చెందిన లక్ష్మి ఇంటి ముందర ఆదివారం రాత్రి 8 గంటలకు జీఏ వైర్ పైన ఆరవేసిన బట్టలు తీస్తూ ఉండగా పడిపోయింది. వెంటనే కుటుంబీకులు అదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్తే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు కుటుంబీకులకు తెలిపారన్నారు. ఈ మేరకు కుటుంబీకులు జువ్వక పోచన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

బోథ్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటాబి గ్రామం సమీపంలోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న విద్యుత్ తీగ తగిలి కౌఠా(బి) గ్రామానికి చెందిన ఎడమల రమణారెడ్డి అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. రమణ రెడ్డి చేనులో ధర్మయ్య అనే వ్యక్తి పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తుండగా.. గ్రామం పక్కనే ఉన్న మసీదు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పైన ఉన్న ఫేస్ వైర్ తెగి న్యూట్రల్ పై పడటంతో తడిగా ఉన్న భూమికి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో పొలం నుంచి వస్తున్న ఎద్దు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. అయితే ఎడ్ల బండిలో ఉన్న ధర్మయ్య అనే వ్యక్తి విషయం గమనించి ఎడ్ల బండిలో నుండి వెంటనే కిందికి దూకారు. దీంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. మృతి చెందిన ఎద్దు విలువ దాదాపు రూ.40 వేల వరకు ఉంటుందని రైతు వాపోయారు. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన రక్షణ లేకపోవడంతో పాటు విద్యుత్ తీగలు కింద పడడం వల్ల ఈ దుస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు. విద్యుత్ తీగలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎస్‌బీఐ 70వ వార్షికోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్

నిర్మల్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్థాపించబడిన తేదీ జూలై 1, 1955 నుంచి రేపటితో 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లాలోని మొత్తం 19 ఎస్‌బీఐ శాఖల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ప్రారంభమైన సంస్థ, 1955 జూలై 1న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా రూపాంతరం చెంది, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 22,970 శాఖలతో విస్తరించి, దేశంలోనే అతిపెద్ద బ్యాంక్‌గా ఎదిగిందని వివరించారు. వినియోగదారులకు సురక్షితంగా, వేగవంతంగా, విశ్వసనీయ సేవలు అందించడమే తమ లక్ష్యమని, ప్యూర్ బ్యాంకింగ్, నథింగ్ ఎల్స్ అనే నినాదంతో బ్యాంక్ ముందుకు సాగుతోందన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, అనాథ ఆశ్రమాలకు అవసరమైన వస్తు సామాగ్రి పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదరోగులకు అవసరమైన సామాగ్రి అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామ్‌గోపాల్ పేర్కొన్నారు.

భూ వివాదంతో భయపడి

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

నర్సాపూర్(జి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుస్లి గ్రామానికి చెందిన నార్వాడే ఆనంద్‌రావు భూవివాదం కారణంగా మనస్థాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. తన మేనల్లుడు మోరే కిషోర్ (సాత్‌గాం గ్రామం), నార్వాడే దిగంబర్ (కుస్లి గ్రామం) తమ భూమి విషయంలో బెదిరింపులకు పాల్పడటంతో ఆనంద్‌రావు ఈ చర్యకు పాల్పడ్డారని ఆయన భార్య అనురాధ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల రోజులుగా కిషోర్‌తో భూ వివాదాలు నడుస్తున్నాయి. వారం రోజుల క్రితం తన పొలంలోని చెట్ల పొదలను తొలగించగా దిగంబర్ దానిని వీడియో తీసి కిషోర్‌కు పంపారు. కిషోర్ ఆ వీడియోను అటవీశాఖ అధికారులకు పంపి వారి ద్వారా ఒత్తిడి చేయించారు. అంతేకాకుండా గత వారం రోజులుగా కిషోర్, దిగంబర్ తన భర్త ఆనంద్‌రావును, కుమారుడు సంజీవ్‌ను బెదిరిస్తున్నారన్నారు. ఆదివారం జూన్ 29న కిషోర్ ఇంటికి వచ్చి బెదిరింగా, సోమవారం జూన్ 3న ఉదయం దిగంబర్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో భయపడిన ఆనంద్‌రావు ఉదయం 11 గంటల ప్రాంతంలో దిగంబర్ ఇంటి ముందు రోడ్డుపై పురుగుల మందు తాగి పడిపోయారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలపగా, ఆటోలో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 1:45 గంటలకు ఆనంద్‌రావు మరణించారు. తన భర్త మరణానికి కారణమైన మోరే కిషోర్, నార్వాడే దిగంబర్‌లపై తగు చర్యలు తీసుకోవాలని ఆనంద్‌రావు భార్య నార్వాడే అనురాధ సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

ధర్తి ఆబ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దిలావర్‌పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ధర్తి ఆబ జన్‌భగిదరి అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీవో గోవర్ధన్ అన్నారు. సోమవారం మాడేగాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ధర్తి ఆబ జన్‌భగీదరి యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెనుకబడిన గిరిజనులు, ఆదివాసీల సమస్యలను పరిష్కరించడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఆదివాసి గిరిజనులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ, బ్యాంక్ అధికారులు, ఆధార్ కేంద్ర అధికారులు, ఆయుష్మాన్ భారత్ అధికారులు, ఐటీడీఏ అధికారులు తదితర 17 శాఖల అదికారులు, పంచాయతీ కార్యదర్శి సునీల్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలున్నారు.

తెలంగాణ ఉద్యమకారుల

న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలి



ఉద్యమకారుల శాంతియుత దీక్ష

నిర్మల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల కనీస న్యాయమైన కోరికలను ప్రభుత్వం నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరమ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టేశేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఉద్యమకారుల శాంతి దీక్షల్లో భాగంగా నిర్మల్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారులు శాంతి దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కొట్టేశేఖర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన విధంగా ఒక కమిషన్ ఏర్పాటు చేసి ఉద్యమకారుల గుర్తింపు చేపట్టాలని తదనుగుణంగా ప్రతి ఉద్యమకారుడికి 25 చదరపు గజాల స్థలం కేటాయించడమే కాగ గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు ఇప్పించాలని, బస్సు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని, ప్రతి ఉద్యమకారుడికి రూ.25 వేల రూపాయల పెన్షన్ మంజూరు చేయాలని, ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో సర్వం కోల్పోయిన విద్యార్థి ఉద్యమకారులకు ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం చేస్తున్న కాలయాపనను నిరసిస్తూ ఉద్యమకారులు జూ న్ 2 నుంచి సెప్టెంబరు 17 వరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఉద్యమ కార్యాచరణను రూపొందించుకోవడం జరిగిందని దానిలో భాగమే ఈ శాంతిదీక్షలు చేపట్టినట్లు తెలిపారు.

నేటిదీక్షల్లో ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర నాయకులు సామకిరణ్‌రెడ్డి, పాకాల రాంచందర్, జిల్లా నాయకులు సామల వీరయ్య, వెంకట్ రామ్‌రెడ్డి, బొల్లోజి నర్సయ్య, గోపి గంగన్న, ఇస్మాయిల్, కటికే శివాజీ, దేవిదాస్, సోన్ సర్పంచ్ వినోద్, డాక్టర్ జగన్, తెలంగాణ షరీఫ్, యాటకారి సాయన్న, చంద్రశేఖర్, కూన భూమేష్, ఎం. శంకర్, తక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఆకోజి కిషన్, నవీన్ కుమార్, ప్రవీణ్‌కుమార్, తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

జాతీయ ర్యాంకింగ్

టోర్నమెంట్‌లో బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

నిర్మల్ జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రవి ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలిక శ్రీవైభవి జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్ బాలిక డబుల్స్‌లో బంగారు పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా రవి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ రాణి, పాఠశాల యాజమాన్యం శ్రీవైభవిని సోమవారం అభినందించారు. శ్రీవైభవి గోవాలో జరిగిన యూ13 జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్ బాలికల డబుల్స్‌లో బంగారు పతకాన్ని సాధించడంతో పలువురు విద్యార్థి ప్రతిభను ప్రశంసిస్తున్నారు.

పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సోన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సంక్షేమం, రక్షణ దృష్ట్యా పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. మండలంలోని సాకెర, తదితర పాఠశాలల్లోని పాఠశాల ఆవరణను, పరిసరాలను, టాయిలెట్స్‌ను పరిశీలించారు. పాఠశాలల్లో ఉన్న బండరాళ్లను, చెత్తా చెదారాన్ని తీసివేయాలని ప్రధానోపాధ్యాయులకు, వీడీసీ సభ్యులకు సూచించారు. అనంతరం మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను వివరించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు గ్రామంలోను, పాఠశాలల్లోను పచ్చదనం, పరిశుభ్రత కొరకు తమవంతు ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లింగన్న, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి



కుభీర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి డా. వడ్నం వసుంధర సూచించారు. సోమవారం మండలంలోని పల్సి నిగ్వా, పాఠశాలల్లో బాల శక్తి, అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. వడ్నం వసుంధర మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలితే ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలను నిర్వహించుకొని ఉచితంగా అందించే మందులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏదయినా అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే తమ గ్రామ పరిధిలోని ఏఎన్ఎంలకు ఆశావర్కర్లకు తెలియజేసి ప్రథమ చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుగుణ, ఆరోగ్య సిబ్బంది, తదితరులున్నారు.

ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

దిలావర్‌పూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బాలశక్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యశాఖ సిబ్బంది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపధ్యాయులు నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రాన్ని తనిఖీ చేసి విచారించిన గిర్దావర్

కడెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కడెం మండల కేంద్రంలోని భవాని మీసేవ కేంద్రాన్ని సోమవారం గిర్దావర్ శారద తనిఖీ చేశారు. ఫిర్యాదుదారుడిని పిలిచి విచారణ చేశారు. మీసేవకు వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.

నాలుగు కాళ్లతో పుట్టిన కోడిపిల్ల

● నర్సాపూర్(జి)లో సంఘటన



నర్సాపూర్(జి), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండల కేంద్రానికి చెందిన గుండోజి రవి ఇంటిలో కోడిగుడ్డు లోంచి సోమవారం సాయంత్రం నాలుగు కాళ్లతో ఒక కోడిపిల్ల బయటకు వచ్చింది. సాధారణంగా రెండు కాళ్లతో పుట్టే కోడిపిల్ల నాలుగు కాళ్లతో పుట్టడం స్థానికులను విస్మయానికి గురయ్యారు. ఈ వింత కోడిపిల్లను చూసిన కొందరు, ఇది పోతులూరి వీరబ్రహ్మంగారి కాలజ్ఞానంలో చెప్పబడిన మహిమ అని నమ్ముతున్నారు. మరికొందరు మాత్రం దీనిని అరుదైన జన్యుపరమైన మార్పుగా భావిస్తున్నారు. ఏదేమైనా ఈ నాలుగు కాళ్ల కోడిపిల్ల పుట్టుక మండల కేంద్రంలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది.

పదవీ విరమణ పొందిన ఎస్సైని

సన్మానించిన జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల



ఎస్సైని సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం భైంసా టౌన్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎండీ గౌస్ పదవీ విరమణ సందర్భంగా డా.జి. జానకి షర్మిల ఐపీఎస్ వారిని సన్మానించారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు అంకిత భావంతో పని చేసి అహర్నిశలు శ్రమించి, సేవలు అందించి, పదవీ విరమణ చేయడం అభినందనీయమన్నారు. వారి అశేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి (అడ్మిన్), నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్, ఏవో యూనస్‌అలీ, ఆర్ఐలు రామ్‌నిరంజన్ రావు, శేఖర్, రమేష్, రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందజేత

నిర్మల్ రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముజ్గి గ్రామంలో సోమవారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్ తెలిపారు. మంజూరైన ఇళ్లకు ముగ్గులు పోసి ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సరిత, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ముథోల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ లబ్ధి దారులకు ప్రొసీడింగ్ కాపీలను ఈవో అన్వర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అందజేశారు. మొత్తం 92 ప్రొసీడింగ్‌లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, పతంగి కిషన్, ఇమ్రాన్ ఖాన్, కిషన్ పటేల్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, ఖలీద్, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

పశు వైద్యశాల భవన నిర్మాణం పూర్తి చేస్తే బాగుంటుంది

● రాంచందర్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, ఖానాపూర్



ఆంధ్రజ్యోతి : పశు వైద్యశాల కోసం నూతన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయా..?

అధికారి: 2022 ఫిబ్రవరి నుండి భవన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకా భవన నిర్మాణం పూర్తి కాలేదు.

ఆంధ్రజ్యోతి : గత మూడేళ్లుగా తాత్కాలికంగా ఓ రెండు షటర్ రూమ్‌లలో పశు వైద్యశాల కొనసాగుతోంది. ఎటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు..?

అధికారి: తాత్కాలిక భవనమైనందున కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రి ప్రాంగణంలో పశువులకు వైద్యం చేసేందుకు ఉపయోగకరంగా ఉండే ట్రేవిస్ (పశువుల స్టాండ్) లేకపోవడంతో పశువులకు ఇంజక్షన్లు, సెలైన్ బాటిళ్లు ఎక్కించేటప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పశువులను చెట్లకు కట్టేసి ఇంజక్షన్లు ఇవ్వాల్సిన పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో ఒక్కోసారి ఇంజక్షన్ చేసే వారిపై పట్టుకున్న వారిపై పశువులు దాడి చేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రాయితీపై అందజేసే గడ్డి విత్తనాలు ఖానాపూర్‌కు ఎన్ని అవసరం..? ఎన్ని అందుబాటులో ఉన్నాయి..?

అధికారి: పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు 75 శాతం సబ్సిడీతో స్వీట్ సుడాన్ గ్రాస్ గడ్డి విత్తనాలను అందజేస్తున్నాం. ప్రస్తుతం గడ్డి విత్తనాలు అందుబాటులో లేవు. ఐదు క్వింటాళ్ల గడ్డి విత్తనాలు అవసరం ఉన్నాయని అధికారులకు ఇదివరకే నివేదిక పంపించాం. త్వరలోనే గడ్డి విత్తనాలు అందుబాటులోకి వస్తాయి.

ఆంధ్రజ్యోతి : జంతువుల నుంచి పశువులకు సంక్రమించే వ్యాధుల నివారణకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు..?

అధికారి: ప్రధానంగా జంతువుల నుండి పశువులకు రాబిస్ లాంటి వ్యాధులు సంక్రమిస్తాయి. జంతువుల నుండి పశువులకు వ్యాపించే వ్యాధులను జూనోసిస్ అంటారు. ఈ నెల ఆరవ తేదీన జూనోసిస్ డే సందర్భంగా 100 పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్‌ను ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి, ఖానాపూర్)

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో.. ప్రవేశాలు అంతంతే!

● నిర్మల్ జిల్లాలో గత విద్యా సంవత్సరం 2460 ప్రవేశాలు ● ప్రస్తుత విద్యా సంవత్సరంలో 1951 ప్రవేశాలు మాత్రమే..

భైంసా, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు అంతంత మాత్రంగానే అవుతున్నాయి. జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభమైనా జిల్లాలో అడ్మిషన్లు మందకొడిగా సాగుతున్నాయి. గతంలో విద్యార్థులతో కళకళలాడే ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జనరల్‌తో పాటు ఒకేషనల్ కోర్సులున్నాయి. ఇప్పటి వరకు జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో కలిపి 1951 మంది విద్యార్థులు చేరారు. కళాశాలల్లో అందించే విద్య, సౌకర్యాలపై అధ్యాపకులు ప్రచారం చేస్తున్నా తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో గత విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. కొన్ని కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉండగా, మరికొన్ని కళాశాలల్లో తక్కువ శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ కారణంగా కొంత మంది తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నప్పటికీ తమ పిల్లల భవిష్యత్ కోసం ప్రైవేటు కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారని వ్యాఖ్యాలు వినవస్తున్నాయి.

● ఇప్పటి వరకు 1,951 మంది చేరిక...

జిల్లాలోని 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటి వరకు 1951 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్‌లు పొందారు. గత సంవత్సరం 2,460 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరారు. గత సంవత్సరంతో పోల్చి చూస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంకా 509 అడ్మిషన్లు జరిగాయి. ఇంటర్ ప్రైవేశాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం చేపడుతున్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి స్పందన అంతంత మాత్రంగానే లభిస్తోంది. ప్రైవేటు కళాశాలలపై దృష్టి సారించిన తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు గాను అంతగా ఆసక్తి కనబర్చడం లేదు. ఈ క్రమంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రవేశాల సంఖ్య తగ్గుముఖం పడుతుందనే వ్యాఖ్యాలు వినవస్తున్నాయి. అయితే దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతేడాది కంటే 4 అడ్మిషన్లు, కుంటాల జూనియర్ కళాశాలలో 10 అడ్మిషన్లు పెరిగాయి.



భైంసా జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు



కుబీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

● ప్రవేశాల పెంపునకు చర్యలు..

పరుశురాం నాయక్, డీఐఈవో, నిర్మల్

ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించాలి. ప్రైవేటుతో పోల్చితే ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుంది. అన్ని రకాల సౌకర్యాలు, వసతులు మెరుగ్గా ఉన్నాయి.

ప్రవేశాలు ఇలా..

కళాశాల	గతేడాది ప్రవేశాలు	ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రవేశాలు
ముథోల్	356	241
కుభీర్	134	119
కడెం	107	89
బాలికల కళాశాల నిర్మల్	387	293
తానూర్	83	82
సారంగపూర్	146	150
బాలురు కళాశాల నిర్మల్	254	233
ఖానాపూర్	218	107
మామడ	168	146
దిలావర్‌పూర్	158	162
లోకేశ్వరం	124	92
కుంటాల	64	74
భైంసా	261	163

ఫోటో న్యూస్



చెట్టునే అమ్మవారిగా మార్చి..

ఆదిలాబాద్ పట్టణంలోని మారెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో చెట్టునే అమ్మ వారీగా మార్చడం ఆకట్టుకుంటోంది. చెట్టు కింద భాగంలో అమ్మవారి ఆకారంగా మార్చి పూజలు జరుపుతు న్నారు. ప్రకృతిని ఆరాధించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ చెట్టును తల్లిగా మార్చి పూజించడంతో ఆలయాన్ని దర్శించుకుంటున్న వారు నిర్వాహకులను అభినందిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఫోన్ బాక్సులో మాట వినిపించేదెప్పుడో..!?

● స్మార్ట్ కార్డులు లేక మూగబోయిన ఫోన్లు ● ఎస్సీ సంక్షేమ గురుకులాల్లో ప్రారంభం కాని ఫోన్‌బాక్స్



ఇచ్చోడ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏర్పాటైన ఫోన్ బాక్సులు



ఫోన్ బాక్సుపై ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం

ఇచ్చోడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పోషకులకు దూరంగా ఉండి వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థుల మనసంతా ఇంటిపైనే ఉంటుంది. ఈ క్రమంలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఈ ఏడాది మొదటిసారిగా విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వసతిగృహాల్లో ఫోన్‌బాక్స్‌లను ఏర్పాటు చేసింది. ఇచ్చోడ ఎస్సీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 640 మంది విద్యార్థులకు గానూ 540 మంది విద్యార్థులు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు ఈ ఫోన్ బాక్స్‌ను వినియోగించకోవచ్చు. ఫోన్ మాట్లాడేందుకు స్మార్టు కార్డు ఆధారంగా పనిచేస్తుంది. ఫోన్‌కు విద్యుత్తు సౌకర్యం అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ స్మార్టుకార్డులు లేక మూగబోయాయి. ముందుగా నిర్ణయించిన విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు, ఎస్సీ గురుకుల సొసైటీ అధికారి నంబర్లు మాత్ర మే ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. ప్రతీ రోజు విద్యార్థులకు కేటాయించిన సమయంలోనే ఫోన్ మాట్లాడేలా చక్కటి ప్రాణాళిక రూపొందించి నప్పటికీ ఈ ఫోన్ కార్యక్రమాన్ని ఇంకా ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. ఎంతో ఆశతో అమ్మనాన్నలకు మాట్లేడేందుకు విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఇకనైనా అధికారులు పట్టించుకోని ఫోన్ బాక్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తే విద్యార్థులకు కొండంత అండగా ఉండటమే కాకుండా.. పిల్లల్లో మానసిక స్థైర్యానికి ఈ కార్యక్రమంలో ఎంతగానో ఉపయోగపడనుంది.

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం



ఆదిలాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షం



పరవళ్లు తొక్కుతున్న గాయత్రి జలపాతం

ఆదిలాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తారు స్థాయిలో వర్షం కురుస్తునే ఉంది. జిల్లా సగటు వర్షపాతం 11.7 మి.మీలు కాగా 4.9 మి.మీల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా ఇచ్చోడలో 9.6 మి.మీలు, తలమడుగు మండలంలో 8.5 మి.మీలు, బజార్ హత్నూర్‌లో 7.5, ఆదిలాబాద్ అర్బన్‌లో 7.0, తాంసిలో 7.6, గాదిగూడలో 6.3, భీం పూర్ లో 6.6మి.మీల వర్షపాతం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు ప్రాజెక్టుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతుంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 209.6మి.మీల వర్షపాతం కురవాల్సి ఉండగా 215.0 మి.మీల వర్షం కురసినట్లు అధికారులు చెబుతున్నారు.

పరవళ్లు తొక్కుతున్న గాయత్రి జలపాతం

ఇచ్చోడ: మండలంలోని గుండివాగు గ్రామంలోని గాయత్రి జలపాతం ధారల ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో గాయత్రి జలపాతానికి జలకళ సంతరించుకుంది.

చింత చెట్లు ఉండటం వల్లే.. చింతగూడ గ్రామానికి పేరు

బోథ్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన చింతగూడ దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం వెలిసింది. ఇదే గ్రామం అటవీ సమీపంలో గుట్ట పక్కన ఉంది. సమీపంలో వాగు ఉండటంతో పాటు గ్రామంలో చింత చెట్లు ఉన్నాయి. ఆదివాసీ గూడెల పేర్లు గ్రామ పటేల్ పేరుతో గాని గ్రామాల పక్కన ఉండే శివారు పేరుతో గాని ఉంటాయి. కాని చింత గూడ గ్రామం మాతరం గ్రామంలో ఒకేచోట చింత చెట్ల గుంపు ఉండటంతో గ్రామానికి చింతగూడ అని నామకరణం చేసుకున్నారు. గ్రామంలోకి వెళ్లగానే చింతచెట్లు స్వాగతం పలికినట్లు ఉన్నాయి. దీంతో ఆ ఊరికి చింతగూడెం అని పేరు వచ్చిందని గ్రావస్థులు అంటున్నారు.

మీకు తెలుసా



చింతగూడ గ్రామంలో ఉన్న చింత చెట్లు ఇవే

బోథ్ ఆసుపత్రి వైద్యం తీరుపై వాట్సాప్ వార్

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న అధికార పార్టీ నాయకులు

● మెరుగైన వైద్యం కావాలంటున్న ప్రజలు

బోథ్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యం రాజకీయ రొంపిలోకి వెళ్లింది. దీంతో ఆసుపత్రిలో డాక్టర్లుగా విధులు నిర్వహించేవారు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సర్కారు వైద్యం స్థానిక ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. దీంతో ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పేదలు ఇబ్బందులకు గురవుతున్నారు.



బోథ్ ఆసుపత్రి

● సూపరింటెండెంట్ బదిలీతో..

బోథ్ మండల కేంద్రానికి చెందిన డాక్టర్ రవీంద్ర ప్రసాద్‌కు ఉట్నూర్ కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఉట్నూరు నుంచి రవి అనే డాక్టర్‌ను పంపించారు. వచ్చిన డాక్టర్ విధుల్లో చేరినట్టే చేరి ఆ తర్వాత దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోయారు. అయితే ఇక్కడి నుంచి ఉట్నూర్ ఆసుపత్రికి బదిలీ అయిన రవీంద్ర ప్రసాద్ మాత్రం విధుల్లో చేరకుండా ఉండిపోయారు. అయితే ఇక్కడ విధుల్లో చేరి దీర్ఘకాలిక సెలవుపై డాక్టర్ వెళ్లడం వాట్సాప్ గ్రూపుల్లో చర్చనీయాంశంగా మారింది. వచ్చిన డాక్టర్‌ని ఎవరో భయ భ్రాంతులకు గురిచేయడం వల్ల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లాడని కొందరు పేర్కొనగా మరికొందరేమో ఉన్న వాళ్ల తో వైద్య సేవలు చేయించుకోవడం మంచిదని పేర్కొ న్నారు. అయితే వాస్తవానికి సామాన్య ప్రజల కోసం ఆసు పత్రిలో వైద్య సేవలు కొనసాగే విధంగా పాలకులు చూడా ల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

● వచ్చిన వారితో పని చేయించుకుంటాం..

బోథ్ ఆసుపత్రికి బదిలీపై వచ్చిన వారితో పని చేయించుకుంటామని వారు విధుల్లో చేరకపోతే నూతనంగా వచ్చే డాక్టర్ ఇక్కడికి రప్పించుకుంటామని అధికార పార్టీ నాయకులంటున్నారు. మొన్నటి వరకు విధులు నిర్వ హించిన రవీంద్ర ప్రసాద్ భార్య మాజీ జెడ్పీటీసీ కావ డం వల్ల కొంతమంది రాజకీయ పార్టీల నాయకులు డాక్టర్ బదిలీకి పట్టు పట్టి తమ పనిని పూర్తి చేసుకున్నట్లు అంటున్నారు. బదిలీ అయిన డాక్టర్‌ను తిరిగి మళ్లీ ఇక్కడికి బదిలీ చేస్తే ఊరుకునేది లేదంటూ పేర్కొంటున్నారు.

● బదిలీ వెనుక వాస్తవం ఏమిటి

మొన్నటి వరకు బోథ్ ఆసుపత్రిలో విధులు నిర్వహించిన రవీంద్ర ప్రసాద్ డాక్టర్ బదిలీ వెనుక వాస్తవాలు ఏమిటి అనేది స్థానికులు నిశితంగా పరిశీలిస్తున్నారు. రవీంద్ర ప్రసాద్ దీర్ఘకాలికంగా ఇక్కడే విధులు నిర్వహించడంతో పాటు ఆయన గతంలోనే ఉట్నూర్ బదిలీ కావడం అనంతరం ఆయన బోథ్ ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం డిప్యూ టేష న్లను రద్దు చేసింది. అయితే డిప్యూటేషన్ రద్దు వల్ల రవీంద్ర ప్రసాద్ బోథ్‌ను విడిచి పెట్టాల్సి వచ్చిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మరికొంత మంది ఏమో బీఆర్ఎస్ పార్టీకి దగ్గరగా ఉండటం వల్ల ఆయనను ఇక్కడి నుంచి పంపించి ఉంటారని చర్చించుకుంటున్నారు.


● ఎవరు ఉంటే మాకేంటి..

వైద్యం అందిస్తే చాలు!

రాజకీయాలతో ముడిపడి ఉన్న బోథ్ ఆసుపత్రి డాక్టర్ల వ్యవహారం క్రమక్రమంగా రాజకీయ రొంపిలోకి జారిపోతుంది. అయితే స్థానిక ప్రజలు మాత్రం డాక్టర్ ఎవరైతే మాకేంటి సరైన వైద్యం చేస్తే చాలు అంటూ పేర్కొంటున్నారు. వైద్యాన్ని రాజకీయ రొంపిలోనికి లాగితే నష్టపోయేది పేద ప్రజలు మాత్రమేనని రాజకీయ నాయకులు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఆరుగురు మంది డాక్టర్లు పనిచేయాల్సిన చోట కేవలం ఇద్దరిని ఇక్కడికి కేటాయించడం వల్ల ఓపిక నశించే విధంగా డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు అయితే మరో నలుగురిని జిల్లా అధికారులు ఇక్కడికి పంపించాల్సిన అవసరం ఉంది.

● అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య డాక్టర్ పోస్టు

బోథ్ ఆసుపత్రి డాక్టర్ పోస్టు భర్తీ వ్యవహారం రాజకీయ వేడిని రాజేసింది. స్థానిక జడ్పీటీసీ భర్త అయినా రవీంద్ర ప్రసాద్‌ను బదిలీ చేయడంతో పాటు డిప్యూటేషన్ రద్దు చేయించడంలో అధికార పార్టీ నాయకుల హస్తం ఉందని ప్రతిపక్ష పార్టీల వారు పేర్కొంటున్నారు. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వాళ్లు మాత్రం ఈ డాక్టర్‌ను ఇక్కడే ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా బోథ్ ఆసుపత్రి వైద్యుల తీరు రాజకీయంగా వేడెక్కింది.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.0 । కనిష్ఠం 22.7

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 1 జూలై 2025


విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఈవో


● చెత్తాచెదారంతో కనిపిస్తున్న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని ఇంకుడు గుంత

నీటి బొట్టు.. ఒడిసి పట్టు!

- జిల్లాలో అధ్వానంగా మారిన ఇంకుడు గుంతలు
- నేలమట్టం కావడంతో వృథాగా దిగువకు వెళ్లిపోతున్న వర్షపు నీరు
- ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- భూగర్భజలాల పెంపుపై క్షేత్రస్థాయిలో కనిపించని అవగాహన
- ఏళ్ల తరబడి నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన గుంతలు

ఆదిలాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఇంకుడు గుంతలపై నిండు నిర్లక్ష్యమే కనిపిస్తుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచి పోతున్నా.. ఇంకుడు గుంతల నిర్మాణం, వాటి పునరుద్ధరణపై అధికారులు దృష్టిని సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే నిర్మించిన ఇంకుడు గుంతలు వృధాగా మారి కనిపిస్తున్నాయి. పూర్తిగా నేల మట్టం కావడంతో వర్షపు నీరు ఇంకే అవకాశమే లేకుండా పోయింది. యేటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నో నిధులను ఖర్చు చేస్తున్న ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదు. ప్రతియేటా ఇంకుడు గుంతలను నిర్మించేందుకు అధికారులు భారీ లక్ష్యం పెట్టుకుంటున్న ఆచరణ సాధ్యం కావడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తుంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలుస్తూనే ఉంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదయ్యే ఈ జిల్లాలో నీటి వనరులు అంతంత మాత్రంగానే అందుబాటులో ఉన్నాయి. ప్రతియేటా వేసవికి ముందే భూగర్భ జలాలు అడుగంటుక పోవడంతో తీవ్రమైన నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడిచిన వేసవి లోనూ కొన్ని మండలాలను డ్రై మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీటి పొదుపుపై ముందుచూపు లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితికి కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన ఆశించిన స్థాయిలో భూగర్భజలాలు కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లోనైతే వేసవిలో తాగేందుకు గుక్కెడు మంచినీరు దొరకని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతీసారి సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నా.. నీటి బొట్టును ఒడిసి పట్టకపోవడంతో ఇలాంటి పరిస్థితికి దారి తీస్తుందన్న వాదనలు లేకపోలేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాల్టా చట్టాన్ని తీసుకొచ్చినా.. అమలు చేయడంలో అధికారులు నిండు నిర్లక్ష్యమే చూపుతున్నారు. అవసరాలకు అనుగుణంగా వర్షపు నీటిని ఒడిసి పట్టక పోవడంతో భూగర్భజలాలు ప్రమాదకర స్థాయికి పడిపోతున్నాయి. ఇంటింటికి ఇంకుడు గుంత అనే నినాదంతో అధికారులు హడావిడి చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణ సాధ్యం కావడం లేదంటున్నారు. అతేకాకుండా ఇంకుడు గుంతల ప్రాధాన్యతపై క్షేత్రస్థాయిలో సరైన అవగాహన లేక పోవడంతో అడుగడుగునా నిండు నిర్లక్ష్యమే కనిపిస్తుంది.




జడ్పీ కార్యాలయంలో పిచ్చిమొక్కల మధ్య కనిపించకుండా పోయిన ఇంకుడు గుంత

వృథాగా పోతున్న వర్షపు నీరు

గతంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టారు. తప్పనిసరిగా ఇంటింటికీ ఇంకుడు గుంతను నిర్మించుకోవాలనే నిబంధన ను విధించారు. దీంతో చాలా వరకు ఇంకుడు గుంతలను నిర్మించుకు న్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణను మరిచిపోవడంతో ప్రస్తుతం నేల మట్టమై కనిపించకుండానే పోయాయి. అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్న ఆదేశాలను జారీ చేశారు. దీంతో అక్కడక్కడ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల ను నిర్మించిన నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాటి ఆనవాళ్లు కనిపించకుండానే పోతున్నాయి. ప్రస్తుతం పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండి పోయి కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి నిర్వహణ లేక పూడిక చేరి నేలమట్టం కావడంతో వర్షపునీరు దిగువకు వృధాగా పోతుంది. జిల్లాలో యేటా అధిక వర్షపాతమే కురుస్తున్నా.. ఆశించిన స్థాయిలో భూగర్భ జలాల పెంపు కనిపించడం లేదు. జిల్లా నేల ఉపరితలం ఎత్తు పల్లాలుగా ఉండడంతో వర్షం కురిసిన వెంటనే నీరు దిగువకు వెళ్లి పోతుంది. వర్షపు నీటికి అడ్డుకట్ట వేయక పోవడంతో యేటా వేల క్యూసెక్కుల వరదనీరు వృధాగా మారుతుంది. చెరువులు, కుంటల ద్వారా కొంతమేర భూగర్భజలాలు మెరుగ్గానే ఉన్నా వేసవికి ముందే నీటి జాడలు అడుగంటుక పోతున్నాయి. వర్షపు నీటిని ఒడిసి పడితేనే భవిష్యత్ తరాలకు నీటి ఇబ్బందులు ఉండవన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు..

ప్రభుత్వ కార్యాలయాల్లో అక్కడక్కడ ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నా.. వాటి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. దీంతో అసలు లక్ష్యం నెరవేరడం లేదు. ఏదో నిర్మించామా, వదిలేశామా అన్నట్లుగానే

(తరువాయి 6వ పేజీలో...)

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య : డీఈవో ఎనుగు

ఇచ్చోడ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని జిల్లా విద్యాధికారి ఎనుగు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్ల పరిషత్తు ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ గదిని ప్రారంభించారు. పీఎం శ్రీ నిధులతో విద్యార్థులకు ప్రత్యేకంగా కంప్యూటర్ గదిని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. విద్యార్థులు సాంకేతిక విద్యను అలవర్చుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ జోషి పదవి వీరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కసావత్ బిక్కు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరించాలి : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసు వ్యవస్థపై వారికి నమ్మకం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జిదారుల నుంచి జిల్లా ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను విన్న జిల్లా ఎస్పీ వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి బాధితుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా సుదూర ప్రాంతాల వారు జిల్లా ఎస్పీని నేరుగా సంప్రదించ లేని వారు 8712659973 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని లేదా ఫిర్యాదులను వాట్సాప్ ద్వారా తెలియజేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్‌కవిత, వామన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **బాధిత కుటుంబానికి చెక్కు అందజేత**

ఆదిలాబాద్ అర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 1989 బ్యాచ్‌లో ఉన్న పోలీసు మిత్రులందరు కలిసి శివాజీ కుటుంబ సభ్యులకు రూ.50 వేల చెక్కును జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎస్సై కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని, ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని ఎస్పీ ఈ సందర్భంగా సూచించారు. ఇందులో 1989 బ్యాచ్ మిత్రులు ఏఎస్సైలు సయ్యద్‌తాజొద్దిన్, రాఘవేందర్, ఈశ్వర్ సింగ్, తుకారాం, జహీర్, సుభాష్, సిబ్బంది, తదితరులున్నారు.

● **'సోనాలలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయండి'**

బోథ్: నూతనంగా ఏర్పాటైన సోనాల మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్‌కు సోమవారం సోనాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గాజుల పోతన్న విన్నవించారు. స్పందించిన ఎస్పీ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

'రోడ్డు ఉన్న గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలి'

ఉట్నూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ నియోజక వర్గం పరిధిలోని రోడ్డు ఉన్న గ్రామాలన్నింటికి రవాణా సౌకర్యం కల్పించే విధంగా ఆర్టీసీ అధికారులు కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ ఆర్టీసీ ఇన్‌చార్జీ డీపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఎమ్మెల్యేను కలిసిశాలువాతో సన్మానించిన అనంతరం పూలబొకే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగు పరచడానికి కృషి చేస్తుందన్నారు. ఉట్నూర్ డిపో ఏర్పాటు చేయడానికి ముఖ్య ఉద్దేశం మారుమూల గ్రామీణ గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యం కలిగించడానికి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉట్నూర్ నుంచి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్, సిర్పూర్ యుల మీదుగా లింగాపూర్ మండల కేంద్రం వరకు, ఉట్నూర్ నుంచి ఇందనపల్లి, కలమడుగు మీదుగా జగిత్యాలకు, ఉట్నూర్ నుంచి మున్యాల్, దస్తూరాబాద్ మీదుగా నిర్మల్‌కు ఉట్నూర్ నుంచి కడెం మీదుగా నిర్మల్‌కు, ఉట్నూర్ నుంచి గుడిహత్నూర్ మీదుగా నిర్మల్‌కు బస్సులను ఏర్పాటు చేసి బస్సులను అందు బాటులోకి తేవాలని సూచించారు. డీఎం వెంట ఆర్టీసీ ఉద్యోగులు రవి, అరవింద్ ఉన్నారు.

అలాగే, ఉట్నూర్‌లో సాగునీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే, ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామ పంచాయతీకి 32 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. కాగా సోమవారం గంగన్నపేటలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పనులకు శంకు స్థాపన చేశారు.


ఉట్నూర్‌లో సాగునీటి పారుదల సబ్ డివిజన్ కార్యాలయ భవనం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

'సీఎంఆర్‌ఎఫ్‌తో ఆర్థిక భరోసా'

నేరడిగొండ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో గల తన నివాసంలో సిరికొండ మండల కేంద్రానికి చెందిన బొడ్డు ప్రేమలకు మంజూరైన రూ.17 వేలు, సోంపల్లి గ్రామానికి చెందిన యమునకు మంజూరైన రూ. 25,500 , బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన బొంగురాల సంగీతకు మంజూరైన రూ.17 వేల విలువ చేసే చెక్కును ఎమ్మెల్యే సోమవారం అందజేశారు.

పోలీసులకు సహకరించాలి : సీఐ

ఉట్నూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల రక్షణకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఉట్నూర్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మడావి ప్రసాద్ అన్నారు. సోమవారం ఉట్నూర్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సంఘ విద్రోహుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

పాఠశాలలపై భరోసా కల్పించాలి

ఉట్నూర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య బోధన చేస్తూ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు భరోసా కల్పించాలని మండల విద్యాధికారి ఆశన్న అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీయూపీఎస్ తాండ్ర, బాబాపూర్ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయ మిత్రులతో కలిసి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడానికి గల కారణాలను తెలుసుకున్నారు. నలుగురు ఉపాధ్యాయులు ఉండడం వలన బోధనకు ఇబ్బంది అవుతున్న దృష్ట్యా ఆరుగురు శిక్షణ ఉపాధ్యాయులను నియమించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది అవుతున్న దృష్ట్యా అదనంగా మరో వర్కర్‌ను నియమించామన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగినందున విద్యార్థులకు అవసరమైన నాణ్యమై విద్య బోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

'గురుకులాల్లో సీట్లు పెంచాలి'

ఉటూర్ జూన్ 30(ఆంధ్రజ్యోతి) గురుకుల విద్యా సంస్థలకు చెందిన గురుకుల పాఠశాలల్లో సీట్లను పెంచాలని, ఇంటర్మీడియట్ కళాశాలలో కోర్సులు పెంచాలని, అవసరమైన చోట భవనాలు వసతి గదులు నిర్మించాలని ఏజెన్సీ డీఎస్సీ సాధన సమితి సభ్యులు జాదవ్ సుమేష్, దీపక్‌లు కోరారు. సోమవారం ఈ మేరకు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. విద్యాసంస్థల్లో సీట్ల పెంపుతో పాటు ఉపాధ్యాయు పోస్టులను కూడా మంజూరు చేయాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన విద్యార్థులకు విద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేయాలి అన్నారు. విద్యా సంస్థల ఏర్పాటుతో ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన, పేద విద్యార్థుల భవిష్యత్‌కు మేలు కలుగుతుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాంసి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాకాలం అయినందున పరిసరాల పరిశుభ్రతపై ప్రతీ ఒక్కరు దృష్టి పెట్టాలని మండల వైద్య బృందం ప్రజలు సూచించారు. సోమవారం బండల నాగపూర్, అట్నం గూడ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. అలాగే మురికి నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏవైనా వ్యాధులు సోకితే వెంటనే ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తులసీరామ్, లక్ష్మీ, పద్మ, అరుణ, తదితరులు ఉన్నారు.


అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా


అర్జిదారులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్తా

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● ప్రజావాణి కార్యక్రమానికి పెద్దసంఖ్యలో తరలివచ్చిన అర్జిదారులు ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని జిల్లాక లెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రజావాణిలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అర్జీదారుడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మఇళ్లకు సంబంధించిన ఫిర్యాదుల కౌంటర్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.అలసత్వం వహిస్తే మాత్రం శాఖపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ సలోనిచబ్ర, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● **సమస్యల పరిష్కారానికి చర్యలు : ఐటీడీఏ పీవో**

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజుల సమస్యల అర్జీలను స్వీకరించిన సందర్భంగా మాట్లాడారు. ఇందులో భాగంగా గురుకుల పాఠశాలలో సీట్లు కావాలని అధిక మొత్తంలో విద్యార్థులు వస్తున్నట్లు ఐటీడీఏ పీవో పేర్కొన్నారు. అలాగే, పింఛన్లు, ఇందిరమ్మ, ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజి జాదవ్, ఏపీఓ పీవీటీజీ మేస్రం మనోహర్, పీహెచ్ఓ సందీప్ కుమార్, ఏడీఎం హెచ్ఓ డాక్టర్ కుడిమెతమనోహర్,ఏఓ దామోదర స్వామి మనోహర్, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలను అడవుల నుంచి తరలించొద్దు

● ఆర్‌వోఎఫ్‌ఆర్ సాగు భూముల్లో మొక్కలు నాటవద్దు ● షెడ్యూల్ 5 ప్రకారం గిరిజనుల హక్కులు కాపాడాలి ● కేంద్ర మంత్రికి మాజీ ఎంపీ సోయం బాపురావు వినతి ● జిల్లాలో జీవో 49ని రద్దు చేయాలంటూ పలు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు

ఆదిలాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆదివాసులను అడవులకు దూరం చేయవద్దని మాజీ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 49 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం కేంద్ర మంత్రి జుయాల్‌ఓరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. హారితహారం పేరిటా పోడు భూముల్లో మొక్కలను నాటవద్దన్నారు. ముఖ్యంగా పోడు భూములకు పట్టాలు, జీవో 49 అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. టైగర్‌కన్జర్వేషన్ పేరిటా ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లాలో అడవుల నుంచి గిరిజనులను తరలించడం సరైంది కాదన్నారు. అధికారుల చర్యలను వెంటనే ఆపే విధంగా ఆదేశించాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లాలో 49 జీవో కారణంగా 339 గ్రామాల పై ప్రభావం పడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాపాడుతేనే హారితహారం పేరిటా సాగు భూముల్లో మొక్కలు నాటడంతో గిరిజనులు ఇబ్బందుల పాలవుతున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన 5వ షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీలోని షెడ్యూల్ ఏరియాలో గిరిజన హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అటవి ఉత్పత్తుల పై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు సైతం పట్టాలు ఇవ్వాలని కోరారు. దీంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆదిలాబాద్ అర్బన్: ఫారెస్టు కన్జర్వేషన్ పేరిటా ఆసిఫాబాద్ జిల్లాలో తీసుకువచ్చిన జీవో 49ను ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. సోమవారం జీవోను నిరసిస్తూ టీఏజీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. టైగర్‌కారిడార్ పేరుతో అడవులనుంచి ఆదివాసీలను వెల్లగొట్టేలా ప్రభుత్వం జీవో 49ను తీసుకువచ్చిందని పూసం సచిన్ అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడుతా మని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆత్రం కిష్టన్న, కొట్నాక సక్కు, తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని కొమురం భీం ఆసిఫాబాద్ ప్రాంతంలో జీవో 49 ద్వారా కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ కార్యక్రమాన్ని చేపట్టడానికి అటవిశాఖ సమయత్తం అవుతున్నందున జీవో 49ని వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం కొమురం భీం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, సంయుక్త కార్యదర్శి ఆత్రం ధనుష్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉట్నూరు ఐటిడిఏ కార్యాలయానికి చేరుకొని ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే జీవో ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కనక మల్కు మడవి నాగోరావు మహేష్ గణేష్ వికాస్ జ్ఞానేశ్వర్ నాందేవ్‌లు ఉన్నారు.


కేంద్రమంత్రికి వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎంపీ సోయం

నార్నూర్: అధికార ప్రభుత్వం ఆదివాసీలు అడవికి దూరం చేసేలా జీఓ 49 తెచ్చిందని వలన తమ హక్కులకు భంగం కలిగేలా ఉన్నాయని, వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ ముందర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్ర భీంరావు మాట్లాడుతూ ఇది 5 షెడ్యూల్డ్ ఏరియా ఏజెన్సీ ప్రాంతం ఎలాంటి అంశాలు ప్రభుత్వం మంజూరు చేయాలన్న రద్దు చేయాలి అన్న ముందుగా ఆదివాసీ ప్రజలతో సంప్రదింపులు చేయాలన్నారు. గత నెల తడోబా అందెరి రిజర్వు ఫారెస్టును కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ కలుపుతూ కుమ్రం భీం ఆసిఫాబాద్ కాగజ్ నగర్ పరిధి 334 గ్రామాలు గజిట్‌లో ఉన్నాయి. ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, త్రీ ఫేజ్ విద్యుత్, ఇతర అన్ని సదుపాయాలు ఫారెస్ట్ అధికారులు ఆపేశారు. ఆదివాసులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన వెంట ఈశ్వరి బాయి పర్చాకే, అంబురావు, పరుశురాం ఉన్నారు

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాడోబా-అందేరి రిజర్వ్ ఫారెస్టును కవ్వాల్ రిజర్వు ఫారెస్టుతో కలుపుతూ కుంరం భీం జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పరిధిలో 334 గ్రామాలను గెజిట్‌లో పేర్కొంటూ తీసుకొచ్చిన జీవో నెం. 49 వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆత్రం తనుష్, ఉయిక విష్ణు, వెట్టి గణేష్, కొట్నాక్ చందు, మెస్రం మారుతి, వసంత్, అశోక్ తదితరులు ఉన్నారు.